సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 20 । జనవరి । 2023



మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం

ఫోర్జరీ సంతకాలతో ఓ వ్యక్తి మోసం చేస్తున్నాడు. అధికారి లేకపోయినా వారి సంతకాలతో పత్రాలు ఇస్తున్నాడు. - 8లో



నిరుపేదలకు అభయం

అభయం యువజన సేవా సంఘం నిరుపేదలకు అండగా నిలుస్తోంది. ఆసరా లేని వారిని ఆదుకుంటోంది. - 8లో

ఐదెకరాల వరి పంట దగ్ధం

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామానికి చెందిన రైతు గోకవలస గోవిందరావుకు చెందిన ఐదెకరాల వరి పంట కుప్పలు గురువారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది తక్షణం స్పందించి నష్ట తీవ్రతను తగ్గించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం కళ్లెదుటే కాలిబూడిదై పోవటంతో రైతు కన్నీరుమున్నీరయ్యారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదని సర్పంచ్ దంత రమణ తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ (పురుషులు, మహిళల) కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు తెలిపారు. ఈ ఎంపికలు పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతాయన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే పురుషులు 85కేజీలలోపు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను అనకాపల్లి పరిధిలోని అంకుపాలెం వేదికగా ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న 70వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చిరంజీవిరావు పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99480 66185 (కె.రమేష్), 96033 05767 (జి.దామోదరరావు) నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లా దేవదాయ శాఖాధికారిగా హరిసూర్యప్రకాష్

- అరసవల్లితో పాటు అదనంగా జిల్లా బాధ్యతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న వి.హరిసూర్యప్రకాష్‌కు జిల్లా దేవదాయ శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో ఉన్న సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాదరావుకు రామతీర్థం, మాన్సాస్‌లకు ఈఓగా బాధ్యతలను యథావిధిగా కొనసాగిస్తూ స్థానిక జిల్లా అధికార బాధ్యతలను నుంచి తప్పించినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా జిల్లా బాధ్యతలు స్వీకరించనున్న హరిసూర్యప్రకాష్, అరసవల్లి ఈఓగా కూడా కొనసాగనున్నారు.

రిమాండ్ ఖైదీ పరారు

శ్రీకాకుళం క్రైమ్ : అంపోలు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న యువకుడు వైద్య పరీక్షల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చి పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాతీపేటకు చెందిన గుడియా కాళీ (22) రెండో పట్టణ పరిధిలో ఉన్న మైనర్ బాలికతో శారీరకంగా సంబంధం పెట్టుకున్నాడని ఈ నెల 9న ఫిర్యాదు అందడంతో.. పోక్సో కేసు కింద కేసు నమోదు చేసి ఇదే నెల 13న శ్రీకాకుళం సబ్ డివిజనల్ డీఎస్పీ మహేంద్ర మాతే విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని రిమాండ్ కోసం శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలు సెంట్రల్ జైల్‌కు తరలించారు. అతనికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఎస్కార్ట్‌గా నలుగురు ఏఆర్ పోలీసులను ఇచ్చి వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో మందులు తీసుకురావడానికి పోలీసులు వెళ్లగా అదే అదనుగా చూసుకుని కాళీ తప్పించుకుని పారిపోయాడు. రిమ్స్ పరిసరాల్లో ఎంత వెతికినా కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులు కాళీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

వేమనకు ఘన నివాళులు



వేమన చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తెలుగు సమాజంలో తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన వ్యక్తి వేమన అని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. వేమన జయంతి సందర్భంగా శ్రీకాకుళం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. తెలుగు జాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచే ఉంటాయన్నారు. తొలుత ఇంటాక్ అదనపు కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు యోగి వేమన జీవితంలో పలు అంశాలు వివరించారు. వేమన ఆలోచనలను ప్రజలకు తెలియజేసిన ఘనత సీపీ బ్రౌన్‌కు దక్కుతుందని తెలిపారు. పిల్లలకు వేమన పద్యాలు, సుమతీ శతకాలు వచ్చి తీరాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, యూత్ కో ఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా టూరిజం అధికారి నారాయణ రావు, ఎస్‌ఈ కార్పొరేషన్ ఈ.డి రామారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాల మాన్ సింగ్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయ ఆవరణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాతలే.. స్ఫూర్తి ప్రదాతలు





ఆకలి తీర్చడానికి మించిన సత్కార్యం, అన్నం పెట్టడానికి మించిన దానం ఏముంటుంది. అది కూడా దేవుని సన్నిధిలో చేయగలిగితే ఆ మానవ సేవ మాధవ సేవతో సమానమవుతుంది. ఇలా 26 ఏళ్లుగా అరసవల్లిలో అన్నదాన క్రతువు జరుగుతోంది. దాతలు ఇచ్చిన విరాళాలతో ఇక్కడ భక్తుల కడుపు నిండుతోంది. అన్న పానీయాలను దేవుని ప్రసాదంగా స్వీకరిస్తూ అనునిత్యం వందలాది మంది భక్తులు ఇక్కడ ఆదిత్యాయ నమోస్తుతే అన్న మంత్రంతో పాటు అన్నదాత సుఖీభవ అన్న పదాన్ని పలుకుతూనే ఉన్నారు. ఈ విరాళాలు ఇప్పటికి రూ.5కోట్లకు చేరడం విశేషం.

- అరసవల్లిలో 1996 నుంచి కొనసాగుతున్న నిత్యాన్నదానం
- ఇప్పటికి రూ.5 కోట్ల వరకు విరాళాలు
- నెలకు సగటున 15 వేల మందికి అన్న ప్రసాదం

అరసవల్లి: దేశంలో నిత్య పూజలు అందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా విశిష్ట గుర్తింపు పొందిన ఆరోగ్య క్షేత్రం అరసవల్లిలో స్వామి వారి అన్న ప్రసాదానికి కూడా ప్రత్యేకత ఉంది. ఇక్కడ 1996లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించగా.. నేటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. గతంలో రోజుకు గరిష్ఠంగా వంద మంది వరకు అన్నదానం అందించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 300 కు చేరింది. నెలలో సుమారుగా ఈ సంఖ్య 15 వేలకు చేరిననట్లుగా రికార్డులు చెబుతున్నాయి. అలాగే ఉల్లి, వెల్లుల్లి, మసాలాలను విని యోగించకుండా చేస్తున్న కూరలు మంచి రుచికరంగా ఉండేలా ఆలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రూ.5 కోట్లకు చేరిన విరాళాలు

నిత్యాన్నదాన పథకానికి అమలు కోసం పలువురు దాతలు తమవంతుగా విరాళాలను స్వచ్ఛందంగా అందజేస్తున్నారు. ఇలా వచ్చిన విరాళాలను ఆలయ అధికారులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ వడ్డీలతో అన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నారు. 1996 నుంచి నేటి వరకు మొత్తం రూ.5 కోట్ల వర కు విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నట్లుగా ఆలయ అధికారులు చెబుతు న్నారు. అలాగే రూ.లక్ష వరకు విరాళాలను అందజేసిన దాతలు (రాజపోషకులు) మొత్తం 110 మంది వరకు నమోదయ్యారు.

రూ.500తో రోజుకు పది మందికి..

నిత్యాన్నదాన పథకంలో ఎక్కడినుంచి వచ్చిన భక్తులైనా అన్నప్రసాదాన్ని స్వీకరించవచ్చు. అలాగే విరాళాలను కూడా ఇవ్వవచ్చు. తమ గోత్రనామాలతో రశీదును పొందవచ్చును. అయితే ఒక రోజుకు కనీసం 10 మందికి అన్నదానానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే శాశ్వత విరాళంగా రూ.5000 (గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు) చెల్లించాలి. అయితే భక్తుల కోరిక మేరకు వారికి నచ్చిన రోజున ఏడాదికి ఓసారి అన్న ప్రసాదాలను అందజేస్తారు.



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

ఇక రూ.లక్ష వరకు విరాళాన్ని ఇస్తే ఆ వడ్డీతో ఏడాదికి 100 మందికి అన్నదానాన్ని గరిష్ఠంగా పదేళ్ల వరకు అందజేస్తారు.

రోజూ స్వామికి నివేదించిన తర్వాతే..

నిత్యాన్నదాన పథకంలో భాగంగా భక్తులకు అరటి ఆకుల్లో పులిహోర, అన్నం, సాంబారు, మజ్జిగ, కొబ్బరి పచ్చడి, శాకాహార కూర వడ్డిస్తారు. అలాగే ప్రతి ఆదివారం బన్సీ రవ్వతో స్వీట్‌ను కూడా వడ్డిస్తారు. అయితే ఈ తయారీ వంటలను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సూచనల మేరకు నిత్యం ఆదిత్యునికి నివేదించిన తర్వాతే భక్తులకు ప్రసాదంగా వడ్డిస్తారు. ఇంతవరకు ఆదివారం ఒక్కరోజే సుమారు 800 మందికి, మిగతా రోజుల్లో 300–400 మందికి మాత్రమే అన్నదానాన్ని అందజేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ చర్యలు చేపట్టారు. ఆదివారాల్లో మరింత పెంచే ఆలోచనను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

నాణ్యమైన అన్నప్రసాదం అందిస్తున్నాం..



ఆదిత్యుని అన్నదాన ప్రసాదాన్ని పూర్తి నాణ్యతతో అందిస్తున్నాం. ఈ ట్రస్ట్‌కు దాతల ప్రోత్సాహం నిజంగా అద్భుతం. కనీసం రోజుకు పది మందికి పైగానే భక్తులు కనీసంగా రూ.500 చొప్పున చెల్లిస్తుంటారు. అలాగే రూ.లక్ష వరకు విరాళం ఇచ్చేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. వీరి పేర్లతో కూడిన బోర్డులను అన్నదాన సత్రంలోనే ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతాం. వీలైనంతలో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

విరాళాలు ఇవ్వాలంటే..



అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఒకరోజుకు రూ.500 చెల్లిస్తే కనీసం 10 మందికి అన్నదానం చేస్తారు.

- ఈ నగదును అరసవల్లి ఆలయం పేరిట మనీ ఆర్డర్ ద్వారా గానీ, నేరుగా గానీ చెల్లించాలి.
- శాశ్వత అన్నదానం కోసం రూ.5000 చెల్లించాలి. ఏదో ఒక రోజు చొప్పున పదేళ్ల పాటు ఈ పథకం అమలవుతుంది.
- అన్నదానానికి చెల్లించాల్సిన నగదును ఈఓ, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం పేరిట యూనియన్ బ్యాంక్ (అరసవల్లి) ఖాతా నంబర్ 211110100009099...(ఐఎఫ్ఎస్‌సి కోడ్: యుబిఐఎన్ 0821110)లో నగదును ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలి. లేదా నేరుగా ఆలయ విరాళాల కౌంటర్‌లో చెల్లించి, పేరు, గోత్రాన్ని అడ్రస్‌తో సహా వివరాలను ఆలయ సిబ్బందికి తెలియజేయాలి.
- ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన భక్తులు ఆ రశీదును అడ్రస్‌తోకూడిన వివరాలను ఆలయ అధికారిక వాట్సాప్ నంబర్ (8978914660, 9491000708)లకు పంపించాల్సి ఉంటుంది.

● బడి ఒడికి..



సెలవులు ముగిశాయి. బడి తలుపులు మళ్లీ తెరచుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో చలపతిరావు అనే ట్రాలీ రిక్షా కార్మికుడు తన మనవళ్లను ఇలా తీసుకెళ్తూ కనిపించారు. తన మనవళ్లకు ప్రభుత్వ బడిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని అందుకే తానే స్వయంగా వారిని రోజూ ఇలా తీసుకెళ్తూ ఉంటానని చెబుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

చురుగ్గా 'డ్రెడ్జింగ్'

గార: జిల్లా పేరెన్నికగన్న కె.మత్స్యలేశం పరిధిలోని కళింగపట్నం బీచ్‌లో బీచ్ కోత నివారణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించడంతో రూ. 7.5 కోట్లు మంజూరవ్వగా వీటిలో ఇప్పటికే గ్రోయిన్ల నిర్మాణానికి రూ. 2కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన నిధులతో డ్రెడ్జింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బీచ్ పూర్వ వైభవం కోసం అధికారులు కృషి చేస్తున్నారు.



డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం



ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై పరీక్ష కేంద్రాల చీఫ్ కోఆర్డినేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం, టెక్కలి సబ్ డివిజన్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభమయ్యాక నిమిషం జాప్యమైనా అనుమతి ఉండదన్నారు. జిల్లాలో 72 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీసుల నిఘా ఉంటుందని, అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటుగా ఒరిజినల్ గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్స్‌కు అనుమతి ఉండదని చెప్పారు. శ్రీకాకుళం పరిధిలో శ్రీకాకుళం పట్టణం, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, పొందూరు మండల ప్రాంతాల్లో, టెక్కలి పరిధిలో టెక్కలి, నరసన్నపేట, కాశీబుగ్గ, కోటబొమ్మాళి ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో 23,735 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో పురుషులు 18,151, మహిళలు 5,584 మంది ఉన్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని అన్నారు. మాల్ ప్రాక్టీస్ వంటివి చోటు చేసుకుంటే క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ టి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, ఎం.మహేంద్ర, జి.శ్రీనివాసరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం

- ఏపీఎస్ఎఫ్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జగన్మోహనరావు




మాట్లాడుతున్న ఏపీఎస్ఎఫ్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జగన్మోహనరావు



శ్రీకాకుళం: ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఏపీ ఫైబర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీ ఫైబర్ కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ ఫైబర్ గ్రిడ్‌ను మరింత విస్తృతం చేసి, పటిష్టం చేశామన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి ఫైబర్ లైన్‌లు వేశామని, అక్కడ ఆప్టికల్ లైన్ ట్రాన్స్‌మీటర్లను అమర్చనున్నట్లు తెలిపారు. దీని వల్ల మారుమూల గ్రామీణ ప్రాంతంలోని గ్రామ సచివాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు, ఆయా గ్రామాల్లో ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్‌కు నెలకు కనిష్ఠంగా రూ.190 నుంచి వివిధ ప్యాకేజీలలో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఏపీ ఫైబర్ మాత్రమే టీవీ చానల్స్, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాలతో కూడిన ట్రిపుల్ ప్లే సర్వీసులను అత్యంత నాణ్యంగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో 80లక్షల ఇళ్లకు సర్వీసులు అందించడానికి లక్ష్యం ఏర్పరుచుకున్నామని తెలిపారు. ఇందుకు కావల్సిన సెటాప్ బాక్సులు, ఇతర పరికరాలు సంస్థ సమకూరుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు తమ సమస్యలను విన్నించారు. వాటిని పరిగణనలోకి తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గౌతమ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ వేణు ప్రసాద్, ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ సాయి కుమార్, జోగారావు, మురళీ కృష్ణ, సాయికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్టీసీలో ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలి'



వ్యాపారులతో సమావేశం నిర్వహించిన ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో గల ఆర్టీసీ ఖాళీ స్థలాలను ఔత్సాహిక వ్యాపారవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కణితి వెంకటరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఒకటో డిపో ఆవరణలో గురువారం ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కణితి వెంకటరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీ రాజుల ఆధ్వర్యంలో ఔత్సాహిక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలోని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, టెక్కలి, పాతపట్నంలోగల ఆర్టీసీ ఖాళీ స్థలాలను 15 ఏళ్ల పాటు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు సంస్థ నిర్ణయించిందన్నారు. ఔత్సాహిక వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆర్టీసీలో టెండర్ ఫారాలు తీసుకుని పూర్తి చేసిన వాటిని ఈ నెల 28వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలలోపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయనగరం, జోన్–1, వీటీ అగ్రహారం, విజయనగరం కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఆదేరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి వ్యాపారుల సమక్షంలో సీల్డ్ టెండర్‌లను తెరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ బమ్మిడి రవికుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కెఎస్ఆర్ శర్మ, ఆర్టీసీ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆటకు రెడీ

- సిక్కోలు వేదికగా 66వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు
- అండర్–14,17,19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోరు
- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలు
- తరలివచ్చిన 13 జిల్లాల క్రీడాకారులు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా 66వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) అండర్–14, అండర్–17, అండర్–19 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2022–23 పోటీలు శుక్రవారం నుంచి మొదలుకానున్నాయి. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్ది, తుది మెరుగులు దిద్దారు.

13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక..

సిక్కోలు వేదికగా ప్రతిష్టాత్మకంగా జరిగే రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 1300 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా నుంచి ఆరుగురు చొప్పున కోచ్ మేనేజర్లు ఆయా జిల్లాల క్రీడాకారుల బృందంతో వెంట వచ్చారు. టెక్నికల్ అఫీషియల్స్‌గా, సహాయకులుగా మరో 80 మంది వరకు పీడీ, పీఈటీలను, నిష్ణాతులను నియమించారు. వీరికి కోడిరామ్మూర్తి స్టేడియంలో భోజన సదుపాయాలు కల్పిస్తుండగా, స్థానిక సమీప పాఠశాలల్లో వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ స్టేట్‌మీట్ పరిశీలకులుగా రంగారావు (కాకినాడ) హాజరవుతున్నారు.



జిల్లాకు చేరుకున్న నెల్లూరు జిల్లా క్రీడాకారుల బృందం

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు..

శ్రీకాకుళం జిల్లాలో 2016లో శ్రీకాకుళంలో, 2018లో పలాసలో రెండు సార్లు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ జరిగాయి. తాజాగా మూడోసారి జరుగుతున్న రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎంతో ప్రతిష్టాత్మంగా ఏర్పాట్లు చేస్తోంది. డీఈఓ గార పగడాలమ్మ నేతృత్వంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, కె.హరిబాబు, సంపతిరావు సూరిబాబు, ఎం.తిరుపతిరావు ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి పి.సుందరావు మాస్టార్ల పర్యవేక్షణలో పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 20వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఈవెంట్స్ మొదలవుతాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



శ్రీకాకుళం వేదికగా నేటి నుంచి మొదలయ్యే రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పీఈటీ సంఘ నేతృత్వంలో వివిధ కమిటీలను నియమించాం. మంత్రి ధర్మాన, జిల్లా కలెక్టర్, డీఈఓ, దాతలు చేయూతను అందిస్తున్నారు.

– బీవీ రమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ, మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ

విజయవంతం చేయాలి..



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే ఈ పోటీలకు గత వారం రోజులుగా సమీక్షిస్తున్నాం. ఏర్పాట్లలో లోటులేకుండా చూస్తున్నాం. జాతీయస్థాయి పోటీలను నిర్వహించగలిగే సామర్థ్యం, పరిణితి కలిగిన పీడీ, పీఈటీలు జిల్లాలో ఉన్నారు. పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు, డీఈఓ, శ్రీకాకుళం

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: వాహనదారులు రహదారి భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత పక్షోత్సవాలు–2023లో భాగంగా రహదారి భద్రతా వారోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికే ఈ కార్యక్ర మం నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం, మైనర్లు వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారంతా లైసెన్సులను తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

'ప్రమాదరహిత జిల్లాగా మార్చుకుందాం'



మాట్లాడుతున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి సీహెచ్ శ్రీదేవి

కాశీబుగ్గ: మన జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చుకుందామని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి సీహెచ్ శ్రీదేవి పిలుపునిచ్చారు. పలాస ఎంవీఐ కార్యాలయం వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం రెండు వందల మంది డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించి ఆమె మాట్లాడారు. శారీరకంగా సక్రమంగా ఉన్నప్పుడే మానసికంగా ప్రశాంత త లభిస్తుందని అన్నారు. బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. ఏడాదికి జిల్లాలో 300 మంది మరణిస్తున్నారని, ప్రతి రోజు మూడు ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైట్ ఈ ప్రగతి నుంచి ఎస్‌బీసీ అనే కేంద్ర ప్రభుత్వ సైటులోకి పూర్తిగా మారుతుందని అన్నారు. అధికంగా రాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల ప్రాణాలు నిలుస్తాయన్నారు. అనంతరం గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలాస ఎంవీఐ శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ వి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ జేఈ జోగారావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, ఎంవీఐ సహాయకులు దాసరి వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్మీ క్యాంటీన్ ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: పలాస వేదికగా శుక్రవారం జరగనున్న ఆర్మీ క్యాంటీన్ ప్రారంభోత్సవానికి జిల్లాలోని మాజీ సైనికులంతా హాజరై విజయవంతం చేయాలని జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హెడ్‌క్వార్టర్స్ తెలంగాణా ఆంధ్రా సబ్ ఏరియా డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియర్ కె.సోమశంకర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ క్యాంటీన్ వల్ల పలాస పరిసర ప్రాంతాల్లోని మాజీ సైనికులు, వితంతువులు, కుటుంబ సభ్యులకు ఎంతగానో ఉపయోపగుతుందని పూర్ణచంద్రరావు సంతోషం వ్యక్తం చేశారు.

ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షునిగా చౌదరి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన చౌదరి పురుషోత్తమనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షునిగా చౌదరి పురుషోత్తమనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక విజయవాడలోని ఎన్‌జీఓ కార్యాలయంలో జరిగింది. ఈ ఎన్నికల్లో ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షునిగా చౌదరి పురుషోత్తమనాయుడు ఎన్నికయ్యారు. ఈయన సహాధ్యక్షునిగా ఎన్నిక కావడం ఇది ఐదోసారి. వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న చౌదరి పురుషోత్తమనాయుడు శ్రీకాకుళం, విజయనగరం వాణిజ్యపన్నుల ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా ఏడు పర్యాయాలు పనిచేసి ఆ శాఖ ఉద్యోగుల ప్రయోజనాల కోసం కృషి చేశారు. ఆయన సహాధ్యక్షునిగా ఎన్నిక కావడంపై ఎన్‌జీఓ సంఘ నేతలు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, ఆర్.వేణుగోపాల్, కె.జయరావు, బి.పూర్ణచంద్రరావు, ఆర్.గోవిందపట్నాయక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నిక అనంతరం ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీకాకుళంలోని సాయిబులతోట వద్దగల ఆయన స్వగృహం వద్ద శుక్రవారం అభినందించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

నిరుపేదలకు అభయం

- ఆదర్శంగా నిలుస్తున్న అభయం యువజన సేవా సంఘం
- ఆసరా లేని వారికి మేమున్నామంటూ భరోసా
- సుమారు వెయ్యి మందికి సాయం
- ఫుడ్ బ్యాంకు ద్వాకరా నిత్యాన్నదానం



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు

టెక్కలి: కష్టాల్లో ఉన్నవారికి మేమున్నామంటూ ఆసరాగా నిలుస్తున్నారు టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం సభ్యులు. ఎటువంటి ఆసరా లేని వారు.., విద్యార్థులు, వృద్ధులు, వితంతువులు, నిరుపేదలు, క్రీడాకారులు ఇలా ఒకరేమిటి.. కష్టం వచ్చి కుటుంబం ఇబ్బందులు పడుతున్నారని తెలిస్తే చాలు యువకులు స్వచ్ఛందంగా స్పందిస్తూ సామాజిక సేవ చేస్తూ తోటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక్క టెక్కలికే పరిమితం కాకుండా జిల్లా సరిహద్దుల్లో ఉన్న వారికి సైతం సామాజిక బాధ్యతగా సేవలు అందజేస్తున్నారు.

30 మందితో మొదలై 330 మందికి చేరువై..

టెక్కలికి చెందిన 108 ఉద్యోగి దేవాది శ్రీనివాసరావు మదిలో మెదిలిన సామాజిన సేవా అస్త్రమే ఈ అభయం యువజన సేవా సంఘం. 2017లో కేవలం 30 మందితో సంఘం ఏర్పాటైంది. సభ్యులంతా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకున్న యువత కావడంతో రూ.100 చొప్పున విరాళంతో సంఘాన్ని నిర్వహిస్తున్నారు. యువత సామాజిక స్పృహకు మరికొంత మంది తోడుగా నిలిచి వారికి తోచిన సాయం అందజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.18 లక్షలు సేకరించి వాటి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వెయ్యి మందికి నిరుపేదలకు సుమారు రూ.14 లక్షల మేర వివిధ రకాల సాయం అందజేశారు. ఇందులో ఆర్థిక సాయంగా సుమారు రూ.7 లక్షలకు పైగా సాయం చేశారు.

సేవా కార్యక్రమాలివే..

- నిరుపేదల్లో అనారోగ్యం కలిగిన వారికి ఆర్థిక సాయం
- పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం



ఫుడ్ బ్యాంక్ ద్వారా ఆహార పొట్లాలు అందజేస్తున్న సభ్యులు

- ఆసరా లేని వారికి నిత్యావసర సరుకుల పంపిణీ
- ప్రకృతి విపత్తు సమయంలో అభాగ్యులకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకుల పంపిణీ
- కోవిడ్ సమయంలో మాస్కులు, నిత్యావసర సరుకుల పంపిణీ
- క్రీడల్లో రాణిస్తున్న నిరుపేద క్రీడాకారులకు ఆర్థిక సాయం
- అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రక్తదానం
- అనాథ మృతదేహాల అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆసరా లేని వారికి ఆకలి తీరుస్తూ..

అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో ఫుడ్‌బ్యాంకు ఏర్పాటు చేశారు. దీని కోసం రూ.4 లక్షలు కేటాయించారు. ఎటువంటి ఆసరా లేని 50 మంది నిరుపేదలకు నిత్యం అన్నదానం చేస్తున్నారు.

యువత భాగస్వామ్యం కావాలి..



ప్రస్తుతం కొంతమంది యువత చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. సామాజిక సేవ వైపు దృష్టి సారిస్తే మానసిక ఆనందం ఉంటుంది. అభయం యువజన సేవా సంఘం ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తున్నాయి. ప్రభుత్వం కొంతచొరవ చూపి సామాజిక కార్యక్రమాలకు స్థలం మంజూరు చేస్తే అక్కడ నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణతో పాటు అభయం సంఘం ద్వారా సామాజిక కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దేవాది శ్రీనివాస్, అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు

ఆర్‌బీఐ అధికారిగా సిక్కోలు బిడ్డ

మందస: మండలంలోని పితాతొళి గ్రామానికి చెందిన చింతాడ అంజనా సుప్రియ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రేడ్ బి మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె తల్లిదండ్రులు లఖినాన రాధాకృష్ణ, శ్యామల, అత్తమామయ్యలు చింతాడ చలపతిరావు, ఉషారాణి దంపతుల ప్రోత్సాహంతో ఈ ఉద్యోగాన్ని పొందినట్టు ఆమె చెప్పారు. తమ గ్రామానికి చెందిన ఆడబిడ్డ ఉన్నత ఉద్యోగం సాధించడంతో స్థానిక సర్పంచ్ చింతాడ సుధ, బీఎస్‌పురం సర్పంచ్ రట్టి సరస్వతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతాడ గణపతి, శిస్టు బాపూజీ, చింతాడ మధుసూదనరావు, రట్టి లింగయ్య, అన్నెపు సతీష్



ఆర్బీఐ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అంజనా సుప్రియ(మధ్యలో)

తదితరులు అంజనాసుప్రియకు అభినందనలు తెలిపారు. కాగా ఆర్బీఐ గ్రేడ్ బి మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుప్రియకు బెంగళూరులోని కార్యాలయంలో అధికారులు సన్మానించారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీలు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం అక్కవరం సమీపంలో కోటబొమ్మాళి మండలం చిట్టయ్యవలస సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ సెల్‌ఫోన్‌ను ఇద్దరు దొంగలు చాకచక్యంగా కొట్టేశారు. ఆయన టెక్కలి వస్తూ హైవేపై ఉన్న టిఫిన్ షాపులో తింటుండగా.. అక్కడే ఉన్న ఇద్దరు గుర్తు తెలియని యువకులు తమ బైక్ పడిపోయినట్లు నటించారు. అది తెలియని వెంకటరమణ వారికి సాయం చేసేందుకు దగ్గరకు వెళ్లగా ఆయన జేబులోని సెల్‌ఫోన్‌ను కొట్టేసి బైక్‌పై పారిపోయారు. స్థానిక తెంబూర్ రోడ్డులో కూడా గురువారం ఇదే మాదిరిగా మరో చోరీ జరిగింది. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం

- వైద్యుల ఫోర్జరీ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగి
- రూ.500 నుంచి రూ. 1000 వరకు వసూలు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లను ఫోర్జరీ సంతకాలతో ఓ వ్యక్తి ఇవ్వడం కలకలం సృష్టిస్తోంది. ఓ వైద్యుని వద్ద పనిచేస్తున్న ఆ వ్యక్తి ప్రభుత్వ వైద్యుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నాడు. మెడికల్ సర్టిఫికెట్లు అవసరమైన వారి నుంచి రోజుల వ్యవధి బట్టి రూ. 500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నాడు. ఈ విషయమై సంబంధిత వైద్యులను ప్రశ్నిస్తే.. తాము కూడా కూడా ఆ వ్యక్తితో మాట్లాడుతున్నామని చెబుతుండడం విశేషం. గతంలో శ్రీకాకుళంలో ఆర్థోపెడిక్ వైద్యునిగా పనిచేసిన డాక్టర్ సూర్యారావు టెక్కలి ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటుండగా, ఆయన సంతకాలతో కూడా మెడికల్ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసి ఇచ్చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నా దృష్టికి వచ్చింది..

శ్రీకాకుళం నగరంలో ఓ వ్యక్తి నా సంతకాన్ని ఫోర్జరీ చేస్తున్నట్టు కొద్ది రోజుల కిందటే నా దృష్టికి వచ్చింది. అతను ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నాను. వాస్తవమని తెలితే క్రిమినల్ చర్యలు తప్పవు.

– డాక్టర్ బి.సూర్యారావు, టెక్కలి ఆస్పత్రి సూపరింటెండెంట్

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి, వరి కుప్ప

నరసన్నపేట: మండల పరిధిలోని నడగాంకు చెందిన ప్రగడ నర్సింహమూర్తికి చెందిన వరి కుప్ప, ఆయన బంధువులకు చెందిన గడ్డి ట్రాక్టర్ గురువారం అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. పొలాల నుంచి శ్రీఆర్ నడగాం చానల్ గట్టు పై నుంచి తీసుకు వస్తున్నప్పుడు పొలాల్లో ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డికి మంటలు వ్యాపించాయి. దీంతో పక్కనే ఉన్న వరి కుప్పతో పాటు ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమైంది. ప్రమాదంలో రూ.80వేల వరకు ఆస్తినష్టం సంభవించింది. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది దయానిధి, సుందరరావు అగ్నిమాపక యంత్రాన్ని తీసుకువచ్చి మంటలు వ్యాపించకుండా నిలుపుదల చేశారు. గడ్డి ట్రాక్టర్, ట్రక్కులు కూడా పూర్తిగా దగ్ధం కాకుండా మంటలను ఆర్పారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కిటకిట

ఆమదాలవలస రూరల్: పండగ సందడి ముగిసింది. ఎక్కడెక్కడి నుంచో సొంతూరికి వచ్చిన వారంతా ఇప్పుడు తిరుగుముఖం పట్టారు. పట్టణాలకు వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకోవడానికి వచ్చిన ప్రయాణికులతో ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ గురువారం రద్దీగా మారింది. సంక్రాంతి పండగకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు వారి ప్రాంతాలకు చేరుకోవడానికి రైల్వే ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం ప్రయాణానికి ముందే రిజర్వేషన్ చేసుకోవడానికి వస్తున్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా రైళ్ల బెర్తులు ఖాళీ లేక అన్ని వెయిట్ లిస్టులే దర్శనమిస్తున్నాయి. ప్రయాణికులు కూడా వెయిటింగ్‌కే ప్రాధాన్యత ఇస్తూ వాటి టిక్కెట్ పొందడానికి రిజర్వేషన్ కౌంటర్ వద్ద క్యూ కడుతున్నారు. సికింద్రాబాద్, విజయవాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూల్, బెంగళూర్, మద్రాస్, ముంబాయి వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు టిక్కెట్ల కోసం ఉదయం నుంచే లైన్లు కడుతున్నారు. మరోవైపు సాధారణ ప్రయాణికులతో కూడా రైల్వేస్టేషన్ కిటకిటలాడుతోంది.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్

చోరీ ఘటనపై క్లూస్ టీమ్ పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం పంచాయతీ పరిధిలోని డేగల పోలూరు గ్రామంలో బుధవారం జరిగిన చోరీపై బాధితులు దుర్యోధన శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగానే గురువారం శ్రీకాకుళం ఎస్ఐ రంజిత్ కుమార్ అధ్వర్యంలో క్లూస్‌బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించింది. బాధితుల ఇంటిలోని అనువణువు పరిశీలించారు. తలుపులు, బీరువా, అలాగే అక్కడ ఉన్న ఒక చెంబుపై చోరీకి పాల్పడిన వారి వేలిముద్రల ఆనవాళ్లు ఉన్నట్లు గమనించారు. పాతపట్నం సీఐ వినోద్ బాబు మరోమారు గురువారం బాధితుల నుంచి మరిన్ని వివరాలు సేకరించారు. ఏఎస్ఐ నరసింగరావు చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించారు.

పూర్తి నివేదికను పై అధికాల కు సమర్పించనున్నట్లు తెలిపారు. డేగల పోలూరు గ్రామానికి ఆనుకుని పదులసంఖ్యలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండటంతో చోరీ జరిగిన షాప్‌కు చాలామంది పెట్రోల్, ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తూ ఉంటారని స్థానికులు చెబుతున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనులు చేస్తున్న యువకులు చాలా మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారే కావడం, బాధితులపై దాడికి పాల్పడిన వారు హిందీలో మాట్లాడటంతో అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



డేగలపోలూరులోని దాడి జరిగిన ప్రదేశంలో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

స్నేహితుల ఆపన్న హస్తం

జలుమూరు: శ్రీముఖలింగం గ్రామానికి చెందిన కుంచాల నారాయణరావు క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం జెమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన కష్టం గురించి తెలుసుకున్న స్నేహితులు, గతంలో క్లాస్‌మేట్లు అందరూ కలిసి తలో చేయి వేసి రూ.లక్ష అతని ఖాతాలో జమ చేశారు. ఆస్పత్రికి వెళ్లి మిత్రుడిని కలిసి ధైర్యం చెప్పారు.

పాలకొండ సబ్ కలెక్టర్ ఔదార్యం



నాగరాజుకు వైద్యం చేస్తున్న కొత్తూరు సీహెచ్‌సీ వైద్యులు

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ డివిజన్ సబ్ కలెక్టర్ ఎస్.కమర్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం తహసీల్దార్ కార్యాలయం తనిఖీ కోసం ఆయన గురువారం తన వాహనంలో వస్తున్నారు. భామిని మండలం సతివాడ గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని భామిని మండలం సతివాడకు చెందిన పాతుల నాగరాజు, నులకజోడు గ్రామానికి చెందిన లోపింటి అనిల్ గాయపడ్డారు. అందులో పోతుల నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని చూసిన సబ్ కలెక్టర్ వెంటనే బండి ఆపి వారి వద్దకు వెళ్లి తీవ్రంగా గాయపడిన నాగరాజును తన వాహనంలో ఎక్కించి సీసీ రాంబాబు సాయంతో కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అనిల్‌ను ప్రత్యేక వాహనం ద్వారా ఇదే ఆస్పత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి పాలకొండ రిఫర్ చేశారు. సబ్ కలెక్టర్ చూసిన చొరవపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ భామిని వెళ్లిపోయారు.

ప్రజాభిప్రాయం మేరకు టారిఫ్ అమలు



టెక్కలిలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, వినియోగదారులు

టెక్కలి: ప్రజాభిప్రాయం మేరకే విద్యుత్ టారిఫ్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విద్యుత్ శాఖ టెక్కలి ఈఈ రాజశేఖర్ పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ శాఖ అమలు చేయనున్న టారిఫ్‌లో భాగంగా ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా గురువారం విశాఖ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈతో పాటు పలువురు విద్యుత్ వినియోగదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ కొత్త టారిఫ్ అమలులో భాగంగా వినియోగదారుల నుంచి అభిప్రాయాలను సేకరించిన అనంతరం చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే టారిఫ్‌ల అమలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కె.శ్రీరామ్‌కిషోర్ అనే విద్యుత్ వినియోగదారుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన అభిప్రాయాన్ని సీఎండీ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఈశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పూత దశలో పొగమంచుతో ప్రమాదం



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి రత్నాల వరప్రసాద్

గార: జిల్లాలో సాగవుతున్న మామిడి, జీడి మామిడి తోటల్లో పూత దశలో పొగమంచు కురవడం వల్ల చాలా నష్టం జరుగుతుందని, వీటికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. ఆయన గురువారం అంపోలు, శ్రీకూర్మం తదితర ప్రాంతాల్లో మామిడి తోటలను పరిశీలించారు. పూత దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో జీడిమామిడి 51 వేల ఎకరాల్లోనూ, మామాడి 5 వేల ఎకరాల్లోనూ సాగవుతోందని తెలిపారు. శీతాకాలంలో పొగమంచుతో పాటు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, దట్టమైన పొగమంచు వల్ల పువ్వులు విచ్చుకుంటాయని, ఇది దిగుబడిపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వీటి నివారణకు నాప్తలిక్ ఆసిటిక్ ఆమ్లాన్ని నీటిలో కలిపి చెట్టు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా మామిడి చెట్లకు పూత దశలో నీటి తడులు ఇవ్వడం వల్ల అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. జీడి మామిడిలో పూత మూడుసార్లు వస్తుందని, నవంబర్-డిసెంబర్ మధ్యలో, జనవరి-ఫిబ్రవరి మధ్యలో, చివరిగా మార్చి నెలలో కూడా పూత వస్తుందన్నారు. జనవరి-ఫిబ్రవరి నెలలో వచ్చే మధ్యస్థ పువ్వును రైతులు సంరక్షించుకోవాలన్నారు. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

మరోసారి లామాసైహాలోత్రిన్ 0.6 గ్రాములు, కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కాయదశలో వచ్చే నల్లని మచ్చల నివారణకు కాన్ఫిడార్ లేదా ఫిప్రోనిల్ అనే మందును ఏదో ఒకదానిని పిచికారి చేసుకోవచ్చన్నారు. కాయదశలో నీటి తడులు దిగుబడి పెరిగేందుకు అవకాశం ఇస్తుందన్నారు.

వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తి: వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తిగా నిలుస్తారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేమన పద్యాల ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ద్విశతాధాని డాక్టర్ మరడాన శ్రీనివాసరావు, తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ ఉమ్మడి శాంతి, కోర్సు సమన్వయకర్త డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ వేమన పద్యాలు, చరిత్ర, రచినపై పరిశోధనలు వివరించారు.



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ప్రత్యేక బీఎడ్‌కు ఐదేళ్ల పాటు ఆర్‌సీఐ గుర్తింపు: వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బీఎడ్ (మెంటల్లీ రిటార్డ్) కోర్సుకు ఢిల్లీకి చెందిన రీహేబిలిటేషన్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) ఐదేళ్ల గుర్తింపు మంజూరు చేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. విశ్వవిద్యాలయం పరిపాలన కార్యాలయంలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. ప్రత్యేక బీఎడ్ కోర్సు విజయవంతంగా ముందుకు సాగుతోందని చెప్పారు. త్వరలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఇంజినీరింగ్ అన్ని విభాగాల్లో బోధన సిబ్బంది పూర్తిస్థాయిలో నియమిస్తామని చెప్పారు. వర్సిటీలో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉదయ్‌భాస్కర్, స్వప్నవాహిని, అనురాధ, కావ్యజ్యోత్స్నలకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతికి సంబంధించిన (సీఏఎస్) కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ అమలు చేయనున్నట్లు తెలిపారు. రెగ్యులర్ బోధకులు ప్రాజెక్టులు, పరిశోధనలు విశ్వ విద్యాలయానికి తీసుకు వచ్చేలా కృషి చేయాలని, కాంట్రాక్టు ఫ్యాకల్టీ సభ్యులు నిరంతరం జర్నల్స్ ప్రచురణ, రీసెర్చ్ వర్క్, ఆర్టికల్ ప్రజెంటేషన్ వంటి వాటిపై దృష్టిపెట్టాలని అన్నారు. విశ్వవిద్యాలయంలో లెర్నింగ్ మేనేజ్ మెంట్ సిస్టం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో అన్ని కోర్సుల్లో ప్లేస్‌మెంట్లు పెరగాలని, ప్లేస్‌మెంట్ సెల్ బలోపేతంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణలపై కూడా దృష్టి పెడుతున్నామన్నారు. రూ.33 కోట్ల పరిపాలన భవనం, రూ.14 కోట్ల వసతి గృహం భవనాలు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డిగ్రీలో ఉన్నత విద్యా మండలి అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్‌వర్క్, పరీక్షల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఒడియా పీఠానికి రూ. 20 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో నోటి ఫికేషన్ విడుదల చేసి ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. భవిష్యత్‌లో విద్య బలోపేతం, విద్యార్థుల్లో స్కిల్స్, ప్లేస్‌మెంట్ కల్పన, ఉపాధికి అవకాశం ఉన్న కోర్సుల ప్రారంభం లక్ష్యంగా చెప్పారు.